## క్లుప్తంగా

### బడేమకాన్ దర్గాలో గంధోత్సవం



దర్గాలో ప్రార్థన చేస్తున్న మతగురువులు

**మదనపల్లె సిటీ:** స్థానిక బెంగుళూరు బస్టాండు వద్ద నున్న బడేమకాన్ దర్గాలో హజరత్ ఖాదర్ షా ఔలియా దర్గా ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గంధోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సైదాపేటలోని దర్గా ముతవల్లి హాషిం ఇంటి నుంచి గంధం బయలుదేరి పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా దర్గాకు చేరింది. దర్గా నందు మత గురువులు చదివింపలు చేసి గంధోత్సవం నిర్వహించారు. పలువురు వేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం లో హిందూ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

### సత్యసాయి జయంతి వేడుక



ప్రసాదం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

**బి.కొత్తకోట:** సత్యసాయిబాబా 99వ జయంతి వేడుక స్థానిక సాయి మందిరంలో భక్తుడు షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిపారు. పేదలకు అన్నదానం చేసి మహిళలకు దుస్తులు అందజేశారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ శేఖర్ బాబు, షాజహాన్ బాషా, వైద్యులు వీవీ.రెడ్డి, మాజీ సర్పంచ్ కుడుం శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

### కాపు సంఘం అధ్యక్షుడి ఎంపిక



సీతారాం

**కురబలకోట:** కాపు(బలిజ) సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా అంగళ్లకు చెందిన శె టి.సీతారాం నియమితులయ్యారు. జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణ నాయుడు శనివారం సీతారాంకు నియామక పత్రం అందజేశారు. సీతారాం మాట్లాడుతూ జిల్లాలో బలిజ (కాపు)కులస్తుల సమస్యలపై పోరాడతానని, త్వరలో జిల్లా అంతటా పర్యటిస్తానని తెలిపారు.

### మినీ గోకులం షెడ్ల నిర్మాణం వేగవంతం



కొనసాగుతున్న ఉపాధి పనులు

**తంబళ్లపల్లె:** ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన మినీ గోకులం షెడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఉపాధి హామీ ఏపీడీ మధుబాబు కోరారు. మండలంలోని బూదలవారిపల్లె, ఇట్నేనివారిపల్లెలో జరుగుతున్న మినీ గోకులం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆరు ఆవుల షెడ్లకు రూ.2.30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఆయన వెంట ఏపీఓ ఆంజనప్ప, ఇంజనీర్ రామన్న, టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

### టౌన్ బ్యాంకు అభివృద్ధికి సహకారం



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

**మదనపల్లె:** పట్టణంలో వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ది మదనపల్లె కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికవడం శుభ పరిణామమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. టీడీపీ కార్యాలయంలో టౌన్ బ్యాంకు డైరెక్టర్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వందేళ్ల టౌన్ బ్యాంక్ చరిత్రలో ఎన్నికలు లేకుండా నామినేషన్ రోజునే డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికవడం ఇదే ప్రథమమని తెలిపారు. బ్యాంకును అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి, ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని ఆయన కోరారు. టౌన్ బ్యాంకు చైర్మన్‌గా నాదెళ్ల విద్యా సాగర్, ఇప్పటికే రెండుసార్లు సమర్థంగా పనిచేశారన్నారు. నాదెళ్ల విద్యాసాగర్ టౌన్‌బ్యాంక్ చైర్మన్ కావడమే నిదర్శనమన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళుతున్నామని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. ఈ కార్యక్రమంలో నాదెళ్ల శివ, రాటకొండ సోమశేఖర్, పసుపురవి, ఎస్.భాస్కర్‌కుమార్ పాల్గొన్నారు.

### సచివాలయాల తనిఖీ

**సంబేపల్లె:** మండల పరిధిలోని గ్రామ సచివాలయాలను శనివారం అన్నమయ్య జిల్లా సంక్షేమ బీసీ వెల్ఫేర్ అధికారి సూర్యప్రకాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి పల్లె, మోటకట్ల, సంబేపల్లె, రౌతుకుంట, దేవపట్ల గ్రామాల సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

# అన్నీ ఉన్నా.. సేవలు సున్నా

పేరుకు రైల్వే స్టేషన్... బ్రాడ్‌గేజ్‌గా మార్చి నూతన భవన నిర్మాణం చేశారు.. ప్రయాణికులకు మాత్రం ఇవీ ఎంతకీ ఉపయోగపడడం లేదు. మరుగుదొడ్లకు తాళాలు పడ్డాయి. తాగునీటి దిమ్మె విరిగిపోయింది. వెరసి ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు.

- ములకలచెరువు రైల్వే స్టేషన్‌లో అసౌకర్యాలు
- మరుగుదొడ్లు, నీటి కొళాయిలు నిరుపయోగం
- బ్రాడ్ గేజ్‌గా మార్చినా తీరని ప్రయాణికుల ఇక్కట్లు



సౌకర్యాలు లేని ములకల చెరువు రైల్వే స్టేషన్

**ములకలచెరువు:** ములకలచెరువు రైల్వే స్టేషన్‌ను బ్రాడ్ గేజ్‌గా మార్చి గతంలో నూతన భవనాన్ని నిర్మించారు. ప్రయాణికులకు మాత్రం పాత కష్టాలే తప్పడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఈ స్టేషన్‌కు ముందే చేరుకుంటారు. వీరి సౌకర్యార్థం మల,మూత్ర విసర్జనకు మరుగుదొడ్లు, దాహం తీర్చుకునేందుకు నీటి కొళాయిలను నిర్మించినా నిరుపయోగంగా మారాయి. మరుగుదొడ్లకు ఎల్లవేళలా తాళాలు వేస్తున్నారు. కుళాయిలు విరిగిపోయాయి. దిమ్మె పగిలి పోయింది. ఈ స్టేషన్‌లో రైలు ఎక్కువ సేపు ఆగడం లేదు. ప్రయాణికులు నీటిని బాటిళ్లకు నింపుకోవడానికి సౌకర్యం లేకపోవడంతో బయట దుకాణాల్లో నీటి ప్యాకెట్లు, బాటిళ్లు కొని చేతి చమురు వదిలించుకుంటున్నారు. కాఫీ, టీ, తిను బండారాల కోసం క్యాంటీన్లు నిర్మించినా ఇప్పటికీ ప్రారంభించలేదు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో చెత్తా, చెదారం నిండిపోయింది. అధికారులు వెంటనే స్పందించి సౌకర్యాలను కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పగిలిన కుళాయి దిమ్మె

**ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి**



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సమస్యలపై రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సౌకర్యం కల్పించాలి. ,క్యాంటీన్లు ప్రారంభించాలి. అంతేకాకుండా పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– బి. ఆయిషా, ములకలచెరువు

**సౌకర్యాలు కల్పించాలి...**



ప్రయాణికులు ఆశించిన స్థాయిలో రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించడం లేదు. మరుగుదొడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తిను బండారాలు బయట కొనాల్సిందే. స్టేషన్ ఉందన్న మాటేగానీ వ్యాపార వేత్తలకు అనుగుణంగా రైళ్లు, స్టేషన్‌లో సౌకర్యం లేదు.

– యం. క్రిష్ణప్ప, ములకలచెరువు

## 26న కలెక్టరేట్ వద్ద మున్సిపల్ వర్కర్స్ ధర్నా

**మదనపల్లె:** అన్నమయ్య జిల్లా రాయచోటి సబ్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం కార్యదర్శి వర్రిసురేష్‌కుమార్ కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకువచ్చిన ఈ కోడ్లను రద్దుచేసి, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచుతున్నామని కేంద్రం ప్రకటించిన ప్పటికీ, ఇప్పటివరకూ అమలుకు నోచుకోలేదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా నిలిపే బాధ్యత కూటమిప్రభుత్వానిదే అన్నారు. నల్ల చట్టాలను రద్దుచేయాలని దేశ రాజధాని ఢిల్లీలో 13 నెలలు నిర్వహించిన ఉద్యమంలో 750మంది రైతులు ప్రాణత్యాగాలు చేస్తే.. ఒక రైతు కుటుంబాన్ని ఆదుకోలేదన్నారు. ప్రతి ఏడాది రైతులు రూ.3 లక్షల కోట్లు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వెలిగల్లు ప్రాజెక్టుకు హంద్రీనీవా నీరు తీసుకువచ్చి మండిపల్లి రిజర్వాయర్, ఝురికోన, పింఛా డ్యామ్, తదితర చెరువులను నింపాలన్నారు. అన్నమయ్య డ్యామ్‌ను త్వరితగతిన నిర్మించాలన్నారు. ముదివేడు ప్రాజెక్టు భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. మదనపల్లెలో టమాటా గుజ్జు పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, నాగరాజు, పృథ్వీరాజ్, గంగులప్ప, నరసింహులు, నాగరాజు, ఓబులేష్, శేఖర, మధు, రెడ్డెమ్మ, శ్రీనాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

## ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి స్పందన

**మదనపల్లె:** పట్టణంలోని నక్కలదిన్నె సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరుకు చెందిన ఆర్థోపెడిక్ స్పెషలిస్టులు డాక్టర్‌విద్యాసాగర్, డాక్టర్.నిరీష్ రోగులను పరీక్షించి, చికిత్స అందించారు. ఎముకలు, కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్య, మోచేతి, మణికట్టు సమస్యలకు వైద్యులు ఉచితంగా చికిత్స చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.లావణ్య, మోషీనా, స్వాస్థ ఆస్పత్రి ఫీల్డ్ ఆఫీసర్ పవన్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థోపెడిక్ వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా మహా ధర్నా

**గుర్రంకొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేస్తోందని జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్ష్య, కార్యదర్శులు శ్రీనివాసులు, మెహరాజ్ విమర్శించారు. మండలంలోని ఖండ్రిగ గ్రామంలో జరిగిన సమావేశంలో మహ ధర్నా పోస్టర్లను వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న రాయచోటి కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ధర్నా చేపట్టినట్లు తెలిపారు. పరిశ్రమలు, గనులు, నౌకాశ్రయాలను, కార్పొరేట్లకు అప్పగించడం దారుణమన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 ఇవ్వాలని సుప్రీమ్ కోర్టు చెప్పినా పట్టించుకోలేదన్నారు. అంగన్ వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన వర్కర్లను రెగ్యులర్ చేయకపోవడం సమంజసం కాదన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని తుంగలో తొక్కి 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తోందన్నారు. వ్యవసాయ మోటార్లు, గృహ వినియోగదారులు, చిన్న వ్యాపారులకు కూడా విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నారాయణ, విజయకుమారి, మనీశ్వరమ్మ, రేష్మా, అమీరున్నిసా, శ్రీలేఖ, కవిత, తదితరులు పాల్గొన్నారు.



మహా ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

## లక్ష్మీనరసింహుడి ఆలయంలో విశేష పూజలు

**గుర్రంకొండ:** మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం నాలుగో శనివారం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. అనంతరం తోమాల, ఏకాంతసేవ గావించారు. స్వామిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామిని పూజించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

## అత్యవసర పనులకు ప్రథమ ప్రాధాన్యం

- డ్వామా పీడీ వెంకటరత్నం

**కలకడ:** ఉపాధి హామీ పథకం కింద అత్యవసరమైన పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పూర్తిచేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం సూచించారు. కలకడ ఎంపీడీవో కార్యాలయంలో కలకడ, కేవీపల్లె ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్షించారు. గ్రామాల వారీగా జరుగుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం మండలంలోని బాలయ్యగారి పల్లె పంచాయతీలో జరుగుతున్న క్యాటిల్ ఫాండ్, కలకడ పంచాయతీలో జరుగుతున్న క్యాటిల్‌షెడ్ పనులను ఆయన తనిఖీ చేశారు. వర్షాకాలంలో కాలువలు, రైతులకు సంబంధించిన పనులు, వర్షాభావంతో పంట దెబ్బతినకుండా నీటి నిల్వలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆదేశించారు. కూలీలు వలస వెళ్లకుండా ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలకడ, కేవీపల్లె మండలాల ఏపీఓలు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



కలకడ మండలంలో పనులను పరిశీలిస్తున్న డ్వామ పీడీ వెంకటరత్నం, తదితరులు

## నేటి యువతే దేశానికి వెన్నెముక

**పీలేరు/పీలేరు రూరల్:** యువతే దేశానికి వెన్నెముక అని స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శివరామిరెడ్డి అన్నారు. స్థానిక కళాశాలలో ఎన్‌సీసీ 76వ స్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ శివరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీ క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తికి చిహ్నమని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని క్యాడెట్లు అనేక మంది భారత సైన్యంలో చేరి దేశ రక్షణలో భాగం కావడం కళాశాలకు గర్వకారణమన్నారు.

స్వామి వివేకానంద కోరుకున్న ఇనుప కండలు, ఉక్కు నరాలు లాంటి యువత ఎన్‌సీసీ ద్వారా తయారవుతారన్నారు. చదువుతో పాటు శారీరక వ్యాయామం, ఆటలపై దృష్టి పెట్టి విద్యార్థులు చక్కని దేహదారుఢ్యం కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రిన్సిపల్‌తోపాటు డాక్టర్ నాగవేణి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వెంకటరమణయ్య, ఎన్‌సీసీ క్యాడెట్లు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న శివరామిరెడ్డి

## మహిళలకు ఇబ్బందులు కలగకుండా చూడండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

**మదనపల్లె:** పోస్టాఫీసుకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన వసతులు కల్పించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ కోరారు. ఆధార్ లింకేజీ అగచాట్లపై ప్రజల ఫిర్యాదు మేరకు శనివారం ఆయన హెడ్ పోస్టాఫీసు చేరుకుని విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ పథకాలకు ఎన్‌పీసీఐ లింకింగ్ తప్పనిసరి అని చెప్పడంతో మహిళలు పెద్ద సంఖ్యలో పోస్టాఫీసుకు వస్తున్నారన్నారు. రోజువారీ కూలి పనులు వదులుకుని క్యూలైన్లలో నిల్చున్నామని, పోస్టల్ అధికారులు వసతులు కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని మహిళలు నిసార్ అహ్మద్ దృష్టికి తెచ్చారు. దీంతో పోస్టల్ అసిస్టెంట్ సూపరిండెంట్ నీలిమ, హెడ్ పోస్ట్‌మాస్టర్ సునందలను ఆయన కలిసి ప్రజల ఇబ్బందులను వివరించారు. అధికారులు మాట్లాడుతూ.... దీపం 0.2 పథకానికి సంబంధించి డబ్బులు పోస్ట్ ఆఫీస్ అకౌంట్‌లో పడుతాయని తాము చెప్పలేదన్నారు. జాతీయ బ్యాంకు అకౌంట్ కలిగి ఉండి, దానికి ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ లింకేజీ ఉంటే పోస్టాఫీసు ఖాతా అవసరం లేదన్నారు. బ్యాంకులో అకౌంట్ లేని వారికి కేవలం రూ.200 తీసుకుని రెండు నిమిషాల్లో అకౌంట్ ప్రారంభించేందుకు పోస్టల్ శాఖ అవకాశం కల్పించిందన్నారు. నిసార్ అహ్మద్ మహిళలకు విషయాలను వివరించి ఇబ్బందులు పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముని శేఖర్, ఈశ్వర్‌నాయక్, పూజారి చరణ్ పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

## ఓవర్ లోడ్‌తో వెళ్తే కేసులు నమోదు చేస్తాం

**పీలేరు:** ఆటోలు, రవాణా వాహనాలలో ఓవర్ లోడ్‌తో వస్తువులు, ప్రయాణికులను తరలించడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చేస్తే కేసులు నమోదు చేస్తామని పీలేరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ విజయకుమారి పేర్కొన్నారు. స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంలో వాహన చోదకులు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై శనివారం సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతా కమిటీ సభ్యురాలు పీవీఎస్.లక్ష్మి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ప్రమాదాలు జరిగిన గంట సమయాన్ని గోల్డెన్ అవర్(బంగారు గంట సమయం)గా భావించాలని, ప్రమాదానికి గురైన వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి చేర్చిన వారికి రూ.5 వేలు బహుమతిగా ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సలహా దారులు సుధాకర్‌రాయల్, ఆటోయూనియన్ అధ్యక్షుడు బోదేషా, అతికషపి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న విజయకుమారి

## బీజేపీ విజయంపై నాయకుల సంబరాలు

**మదనపల్లె:** మహారాష్ట్రలో బీజేపీ నాయకత్వంలోని కూటమి విజయం సాధించడంపై మదనపల్లె బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బండి ఆనంద్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం, ఎన్‌టీఆర్ సర్కిల్‌లో బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథం వైపు పయనిస్తున్న తీరు చూసి మహారాష్ట్ర ప్రజలు కూటమికి పట్టం కట్టారన్నారు. శివసేన, అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్‌సీపీ కార్యకర్తలు విజయానికి తమ వంతు కృషి చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ విషప్రచారం చేసినా, ప్రజలు భారతీయ జనతాపార్టీ కూటమికి మద్దతుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆకులకృష్ణమూర్తి, భగవాన్, పిల్ల స్వామి నాయక్, వి.నారదరెడ్డి, డీఆర్.జగదీష్, కిరణ్‌కుమార్, శ్రీకాంత్, అమూల్ కుమార్, సాయి ప్రసాద్, భార్గవ్, గోకుల్, బాల, నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

## భక్తి శ్రద్ధలతో సహస్ర దీపాలంకార సేవ

**మదనపల్లె సిటీ:** స్థానిక దేవళం వీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలోని భక్తులు శనివారం సహస్ర దీపాలంకార సేవ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఆలయం చుట్టూ దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. అన్నమయ్య వంశీయులు 12వ తరం వారసులు హరినారాయణచార్యులు తాళ్లపాకస్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆలయ అర్చకులు గోవర్ధన భట్టార్, బాలాజీ వేద మంత్రోచ్చరణ మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి సేవలో ఆయన అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, నాగేంద్ర, నాగరాజ, వినోద్ ,గార్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



దీపాల వెలుగులో స్వామి, అమ్మవార్లు

### డిసెంబర్ 4న విజయవాడలో ప్రజా హక్కుల సభ

**గాలివీడు:** ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిసెంబర్ 4న విజయవాడ జింఖానా మైదానంలో ప్రజా హక్కుల సభను నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ తెలిపారు. శనివారం గాలివీడులోని నాలుగురోడ్ల కూడలి వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఊసే లేదని, రుద్యోగభృతి, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్లు, వలంటీర్లకు రూ.10 వేలు గౌరవ వేతనం అని దగా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వైఖరికి నిరసనగా జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్, రవి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు కెరీర్‌పై అవగాహన పెంచుకోవాలి

**రాయచోటి టౌన్:** చదువు పూర్తి కాగానే ఉద్యోగాలకు వెళ్లే విద్యార్థులు ప్రధానంగా కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఏసీపీ, ఎన్ఐఏ న్యూఢిల్లీకి చెందిన కె. అచ్చినాయుడు సూచించారు. శనివారం రాయచోటిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యంతో పాటు రాయచోటి రోటరీ క్లబ్ వారు సంయుక్తంగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సు పూర్తి అయ్యేలోగా ప్రతి విద్యార్థి జనరల్ ఇంగ్లీష్, రీజనింగ్, ఆప్టిట్యూడ్, సింపుల్ మ్యాథ్‌మాటిక్స్, జనరల్‌నాలెడ్జ్ వంటి అంశాలపై పట్టు సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మనోజ్ కుమార్, రోటరీ క్లబ్ సభ్యుడు విశ్వజవహర్, సెక్రటరీ శశిశేఖర్, కోశాధికారి మహేష్ రాజు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

–కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

**సిద్దవటం:** ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌ను శనివా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఇసుకను మాత్రం ఆయా గ్రామాల పరిధిలో గృహ అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్, సిద్దవటం, ఒంటిమిట్ట ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

### త్రోబాల్ పోటీలకు ఎంపిక

**గాలివీడు:** రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువగొట్టివీడు జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు బాలగంగాధర్ నాయుడు, కె.శివ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసులు తెలిపారు. ముక్కవారిపల్లె ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో అండర్ 14 విభాగంలో 9 వ తరగతి చదువుతున్న తమ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు జె.వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

### ప్రజలకు నాణ్యమైన విద్యుత్

**సిద్దవటం:** ప్రజలకు త్రీ ఫేసులో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు సిద్దవటంలోని 33/11కేవీ ఉపకేంద్రం నుంచి 11 కేవీ వెంకటాయపల్లె ఆర్‌డీఎస్ఎస్ ఫీడర్‌ను ప్రారంభించామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరి సేవ్యానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ అవసరాలకు, పరిశ్రమల స్థాపనకు 24 గంటలు విద్యుత్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్( కన్‌స్ట్రక్షన్)నాగరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సిద్దవటం విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హైవేపై.. హాయిగా

- అంగళ్లు ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం
- దూసుకుపోతున్న వాహనాలు

**కురబలకోట:** ములకలచెరువు నుంచి అంగళ్లు మీదుగా మదనపల్లె మండలం తట్టివారిపల్లె సర్కిల్ వరకు హైవే (ఎన్‌హెచ్–42) పనులు పూర్తయ్యాయి. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో ఈ రోడ్డుకు రూ. 332.11 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయి. గత ఏడాది జనవరి 26న ఈ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ ఏడాది అక్టోబరు 24న ఈ రోడ్డు పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. కేసీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పీఎల్ఆర్ కంపెనీ సంయుక్తంగా ఈ రోడ్డు పనులు చేపట్టినట్లు హైవే అధికారులు తెలిపారు. శుక్రవారం నుంచి ఈ మార్గంలో ట్రయల్స్‌కు వాహనాలను అనుమతించారు. అంగళ్లు దగ్గరున్న దొమ్మన్నబావి నుంచి మదనపల్లె వరకు పోర్‌వే రోడ్డు వేశారు. ఈ బైపాస్ రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

**అర్ధ శతాబ్దంగా అవస్థలు**

50 ఏళ్లుగా అంగళ్లులో ట్రాఫిక్ సమస్య ఉండేది. చిన్నపాటి సంఘటనలు, ధర్నాలు, ఆందోళనలతో పాటు ట్రాఫిక్ జామ్ అయితే నాలుగు రోడ్లుపొడవునా వాహనాలు బారులు తీరి నిలచిపోయేవి. ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. వీటన్నింటికి కొత్త బైపాస్ చెక్ పెడుతోంది. దీంతో సమయం ఆదా కావడంతో పాటు ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం లభించినట్లైంది. కదిరి, కడప, మదనపల్లె, సీటీఎం మార్గాల నుంచి వచ్చే వాహనాలు అంగళ్లు బైపాస్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వివిధ కళాశాలల బస్సులు కూడా ఒకేసారి బయలుదేరుతుండడంతో ప్రతి రోజు సాయంత్రం అంగళ్లులో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యేది. కొత్త బైపాస్‌తో ఈ సమస్యలకు చెక్ పడింది. అంతేగాకుండా ఇక మీదట అంగళ్లులో ధర్నా, రాస్తా రోకో, ఆందోళనలు, సభలు, సమావేశాలు లాంటివి సాగించినా కొత్త బైపాస్ మీదుగా ట్రాఫిక్ మళ్లిస్తారు. ప్రయాణీకులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా సాగిపోతాయి. ఈ రోడ్డుకు కృషి చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి వాహనదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. త్వరలో అధికారికంగా ప్రారంభించనున్నట్లు హైవే అధికారులు తెలిపారు.



అంగళ్లు కొత్త బైపాస్ రోడ్డు